
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

కడప
జిల్లా వార్తలు
5
ఆదివారం 18 ఆగస్టు 2024

జిల్లాలోని ప్రైవేటు హాస్టళ్లలో ఎటువంటి నిబంధనలు, పర్యవేక్షణ లేకపోవడం.. పోలీసులు నిఘా పెట్టకపోవడంతో యాజమాన్యాలు డబ్బే పరామావధిగా వ్యవహరిస్తున్నాయి. ఇక హాస్టళ్లలో ఉండే యువత మద్యం మత్తులో చేసే హంగామా.. అల్లరిచేష్టలకు హాస్టళ్ల పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. కొన్నిచోట్ల ప్రైవేటు హాస్టళ్లలో మాదక ద్రవ్యాలు కూడా వాడుతున్నట్టు సమాచారం.

ప్రైవేటు హాస్టళ్లలో ఇష్టారాజ్యం

- డబ్బే పరమావధిగా యాజమాన్యాల తీరు
- విద్యార్థుల భద్రత, నిబంధనలు గాలికి..
- మద్యం మత్తులో విద్యార్థుల హంగామా
- భయాందోళనలో స్థానిక ప్రజలు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 17: జిల్లాలో పుట్టగొడుగుల్లా ప్రైవేటు హాస్టళ్ల వెలుస్తున్నాయి. ఆయా హాస్టళ్లలో ఇంటర్ నుంచి పీజీ వరకు.. ఇంజనీరింగ్ చదివే విద్యార్థులు వసతి పొందుతుంటారు. కొన్ని ప్రాంతాల్లో అయితే ప్రత్యేకంగా అపార్ట్‌మెంట్లలో హాస్టళ్లను నిర్వహిస్తున్నారు. కడప నగరం నడిబొడ్డులో చిన్న చిన్న రూముల్లో హాస్టళ్లను నిర్వహించడం గమనార్హం. అక్కడ ఒక్కో గదిలో 5 నుంచి 10 మంది ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ భవనాలకు కనీసం ఫైర్‌సేఫ్టీ కూడా ఉండదు. శుద్ధమైన మంచినీరు, నాణ్యమైన భోజనం విషయంలో అనేక ఆరోపణలున్నాయి. అయితే కొన్ని హాస్టళ్లల్లో మాత్రం సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ అవి నామమాత్రమే అని చెప్పాలి. విద్యార్థుల నుంచి అత్యధికంగా ఫీజులు వసూలు చేస్తున్నా భద్రత గురించి పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

పార్టీల పేరుతో.. హంగామా

హాస్టల్స్‌లో ఉండేవారి పుట్టిన రోజు, పార్టీల పేరుతో విద్యార్థులు చేస్తున్న హంగామా అంతా ఇంతా కాదని చెప్పాలి. రోడ్లపై కేక్‌లు కట్ చేయడం, మద్యం తాగి విద్యార్థులు చేసే హడావుడి.. అల్లరి చేష్టలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. దీనిపై స్థానికులు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే వారు లేరు. ఇక శివారు ప్రాంతంలో డజన్ల కొద్దీ హాస్టల్స్ ఉన్నాయి. వీటికి కనీస అనుమతులు కూడా లేవు. ఫలితంగా ప్రభుత్వానికి అనేక రకాల ఫీజులు యాజమాన్యాలు చెల్లించడంలేదు. మున్సిపల్ ట్యాక్స్, విద్యుత్ చార్జీలు, నీటి పన్నులు, వాణిజ్య అవసరాలకు కాకుండా ఇంటికి చెల్లించి నట్లే హాస్టల్ భవనాలకు కూడా చెల్లిస్తున్నారు.

పోలీసుల పర్యవేక్షణ అంతంతే..

ప్రైవేటు హాస్టల్స్‌లో వసతి పొందే వారిపై పోలీసు నిఘా లేదనే ఆరోపణలున్నాయి. కొన్నిచోట్ల విద్యార్థులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థులు చదివే కళాశాల అడ్మిషన్ పత్రం, ఆధార్, శాశ్వత చిరునామా తదితర వివరాలను పట్టించుకోకుండా నిర్వాహకులు ఎవరంటే వారిని హాస్టళ్లలో చేర్చుకుంటున్నారు. పోలీసుల వద్ద కూడా తమ పరిధిలోని హాస్టళ్ల వివరాలు లేవని సమాచారం. గతంలో పోలీసులు తనిఖీలు చేసేవారు. గడిచిన ఐదేళ్లలో ప్రైవేటు హాస్టళ్లకు సంబంధించి ఎలాంటి తనిఖీలు చేపట్టలేదని అంటున్నారు.

భవనాలకు ఫైర్ సేఫ్టీ నిల్

జిల్లాలో హాస్టళ్ల నిర్వహిస్తున్న భవనాలకు ఫైర్ సేఫ్టీ తీసుకున్న దాఖలాలు లేవు. చాలా చోట్ల గృహాల్లో కూడా హాస్టళ్లను కొనసాగిస్తున్నారు. వీటికి ఎటువంటి ఫైర్ సేఫ్టీ కానీ, భద్రత కానీ లేకపోవడం గమనార్హం. ఏదైనా ప్రమాదం జరిగితే విద్యార్థులు నష్టపోయే అవకాశం ఉంది. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వంలో అయినా హాస్టళ్లపై అధికారులు నిఘా పెంచి నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

హాస్టళ్ల లోపల జరిగే వాటితో మాకు ఎలాంటి సంబంధం లేదు. హాస్టళ్ల బయట, పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడినా.. ఏదైనా సంఘటనలు జరిగినా.. గస్తీ తిరు గుతుంటాం కాబట్టి చర్యలు తీసుకుంటాం. హాస్టళ్ల చుట్టుపక్కల వారు ఎవరైనా ఇబ్బందులకు గురైతే మా దృష్టికి తెస్తే చట్టపరంగా చర్యలు చేపడతాం.

- భాస్కర్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ, కడప




కడపలో ప్రైవేటు హాస్టల్ నిర్వహిస్తున్న ఓ భవనం



జగన్ పాలనలో ఇసుక ధరలు పెంచేసి సామాన్యులకు అందకుండా చేశారు. వైసీపీ నేతలు నదుల్లో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వేసి కోట్లు గడించారు. అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక ఇస్తామంటూ చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఆ మేరకు టీడీపీ కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుకను అందిస్తోంది. అయితే ప్రభుత్వం మారినా ఇసుక దొంగల తీరు మాత్రం మారడం లేదు. అధికారులు నిల్వ ఉంచిన స్టాక్ పాయింట్ నుంచే ఏకంగా రూ.34లక్షల విలువ చేసే ఇసుకను కాజేయడం అధికారవర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

పదివేల టన్నులు బొక్కేశారు

- కంచే చేను మేసిన వైనం
- పగడాలపల్లె ఇసుక డంపులో మాయాజాలం


తేది:- 19-7-2024
మహారాజశ్రీ గౌరవనీయులైన కడప జిల్లా కలెక్టర్ దొర గారికి వ్రాసి ఇచ్చిన విన్నపము.
అయ్యా,
...1571/Sand/2024, తేది 07.07.2024 ... 18.07.2024 ... రాత్రి 10:30 ... 11 టిప్పర్లు ...
కావున సదరు విషయాన్ని ... తగిన చర్య తీసుకొని న్యాయం చేయాలని కోరుచున్నాను.
ఇట్లు
తమవిధేయుడు
(యస్. సాదిక్ బాషా)
వి.ఆర్.ఓ.
పెండ్లిమర్రి గ్రామం & మండలము
కలెక్టర్‌కు వీఆర్వో సాదిక్ బాషా చేసిన ఫిర్యాదు కాపీ (ఫైల్)

పెండ్లిమర్రి, ఆగస్టు 17: జగన్ పాలనలో ఉచిత ఇసుకను రద్దుచేసి ప్రైవేటు సంస్థకు ఇసుక రీచ్‌లు కట్టబెట్టారు. జిల్లాలో జేపీ వెంచర్స్ అనే ప్రైవేటు సంస్థ నుంచి ఇసుక రీచ్‌లను సబ్ కాంట్రాక్టర్లు లీజుకు తీసుకున్నారు. పెండ్లిమర్రి మండలంలో పాపాఘ్ని నదిలో తుమ్మలూరు, నందిమండలం గ్రామాల పరిధిలో ఇసుక రీచ్‌లు ఉండేవి. అక్కడి నుంచి ఇసుక రవాణా అయ్యేది. వర్షాకాలంలో ఇసుక కొరత లేకుండా ఉండేందుకు మండల పరిధిలోని పగడాలపల్లె, కొత్తగంగిరెడ్డిపల్లె, ఉలవలపల్లె గ్రామాల పరిధిలో ఇసుక డంపులు ఏర్పాటుచేసి నిల్వ ఉంచారు. ఇంతలో ప్రభుత్వం మారింది.


పగడాలపల్లె వద్ద ఉన్న ఇసుక డంప్ (ఫైల్)

34,155 టన్నులు ఉన్నట్టు గుర్తించారు

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచిత ఇసుక పంపిణీకి శ్రీకారం చుట్టారు. మొదట స్టాక్ పాయింట్లలో ఉన్న ఇసుకను రవాణా చార్జీలు చెల్లించి ప్రజలకు అందించాలని నిర్ణయించారు. రవాణా చార్జీలు, సీనరేజ్ చార్జీల మొత్తాన్ని వినియోగదారులు చెల్లించి ఇసుకను తీసుకెళ్లేలా పాలసీని నిర్ణయించారు. నిర్వహణను డ్వాక్రా సంఘాలకు అప్పజెప్పారు. సీనరేజ్ చార్జీలు, గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, స్థానిక సంస్థలకు వెళ్లేలా నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా స్టాక్‌పాయింట్లలో ఉన్న ఇసుకను మొదట అందించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్, మైనింగ్ అధికారుల సూచనల మేరకు పగడాలపల్లె ఇసుక డంపులో తనిఖీలు చేపట్టి ఇక్కడ 34,155టన్నుల ఇసుక నిల్వ ఉన్నట్లు గుర్తించారు. ఆ మేరకు ఎంపీడీఓను మండల లెవెల్ సూపర్వైజర్‌గా నియమించారు. షిఫ్టుల వారీగా ఇసుక డంపుల వద్ద మూడు షిఫ్టుల్లో వీఆర్వో, పంచాయతీసెక్రటరీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఏర్పాటుచేశారు. వినియోగదారులు టన్ను ఇసుకను రూ.340 చెల్లించి తీసుకెళ్లే విధంగా ఏర్పాటుచేశారు.

10 వేల టన్నులు ఏమైంది?

ఇసుక డంపు ఖాళీ అయిపోయే నాటికి కేవలం ప్రభుత్వానికి 23,511 టన్నులకు మాత్రమే డబ్బులు చెల్లించామని డ్వాక్రా సంఘాల ఏపీఎం తెలిపారు. మిగతా 10వేల టన్నుల ఇసుక ఏమైందో అర్థం కావడం లేదు. కంచే చేనును మేసే విధంగా అధికారుల సమక్షంలో పదివేల టన్నుల ఇసుక మాయం కావడంపై మండలంలో పెద్ద దుమారం రేగుతోంది. తెల్లవారుజామున 4గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు స్టాక్ పాయింట్ నుంచి ఇసుకను తీసుకెళ్లాలి. అయితే ఇక్కడ అధికారుల సమక్షంలో రాత్రివేళల్లో కూడా ఇసుక రవాణా జరిగింది. ఇక్కడ జరిగిన అవకతవకలపై వీఆర్వో సాదిక్‌బాషా కలెక్టర్‌కు, మైనింగ్ శాఖ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇక్కడ ఏ మేరకు ఇసుక మాయం అయిందో జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేస్తే నిజాలు తెలుస్తాయని అధికారులు, ప్రజలు చర్చించుకుంటున్నారు.

సరిగా కొలతలు వేయలేదట..!

ఈ విషయమై మండల లెవల్ సూపర్వైజింగ్ అధికారి అయిన ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డిని వివరణకోరగా ట్రాక్టర్లు, టిప్పర్లు తిరగడం వల్ల వెయ్యి టన్నుల ఇసుక మిస్‌యూజ్ అయిందని అన్నారు. మిగతా ఇసుక గురించి ప్రశ్నించగా అధికారులు తప్పుడు అంచనాలు తయారుచేశారని, ఇక్కడస్టాక్‌పాయింట్‌లో ఉన్నది 25వేల టన్నులు మాత్రమేనని అన్నారు. మైనింగ్ అధికారులు సరిగా స్టాక్‌పాయింట్‌లో కొలతలు వేయలేదని, ఇక్కడ 34వేల టన్నుల ఇసుక లేదని ఎంపీడీఓ తెలిపారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించండి

- జాయింట్ కలెక్టర్ అదితి సింగ్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అదితి సింగ్

కడప(కలెక్టరేట్), ఆగస్టు 17: జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని, వాటి లక్ష్యాల సాధనకు పాటుపడాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్లో జిల్లా విజన్ ప్లాన్ రూపకల్పనపై జిల్లా అధికారులకు ఒకరోజు వర్క్ షాపు జరిగింది. ఈ వర్క్ షాపులో 45 శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ విజన్ ఆంధ్ర-2047 యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రానున్న ఐదు సంవత్సరాలలో జిల్లాను అభివృద్ధి చేసేందుకు ఆ యా శాఖలు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. లక్ష్యాలను అమలు చేసేలా కార్యాచరణ ఉండాలన్నారు. రూపొందించిన యాక్షన్ ప్లాన్‌ను సెప్టెంబరు 15 లోగా సమర్పించాలన్నారు. ముఖ్యంగా పేదరిక నిర్మూలన, జీవన ప్రమాణాల పెంపును దృష్టిలో పెట్టుకుని జిల్లా ఆర్థికాభివృద్ధికి రూ.59,472 కోట్ల నుంచి రూ.1,19,620 మేరకు పెరిగేలా అభివృద్ధి వ్యూహాలను రూపొందించాలన్నారు. తలసరి ఆదాయం రూ.2,40,447 నుంచి రూ.4,83,624కు పెంచేలా కీలకమైన శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అరటి సాగు ఎక్కువగా ఉన్నందున జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ చేసి ఆదాయం పెంచేలా ఆలోచన చేయాలన్నారు. పాడిపరిశ్రమ అభివృద్ధి, పాల ఉత్పత్తుల తయారీ, పొట్టేళ్ల పెంపకం వంటి అంశాలపై ప్రత్యేకదృష్టి పెట్టాలని ఆదేశించారు. మైనింగ్ పరిశ్రమలు విస్తరించాలనీ, సిమెంట్, టెక్స్‌టైల్ వంటి పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలను కల్పించి ఆర్థిక స్థిరత్వానికి తోడ్పాటు అందించాలన్నారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలలో మౌలిక వసతులు కల్పించి ఆదాయ వనరులను సృష్టించాలన్నారు. అలాగే మండల స్థాయిలో రంగాల వారీగా యాక్షన్ ప్లాన్ తయారు చేసుకుని అక్కడ ప్రత్యేకంగా ఉత్పత్తి అయ్యే వాటిని అభివృద్ధి చేసి జియో టాగ్ స్థాయి వరకు తీసుకెళ్లాలన్నారు. అంతకు ముందు పవర్‌పా యింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా ఎంప్లాయి మెంట్ అధికారి సురేశ్‌కుమార్ విజన్ ఆంధ్ర -2047 లక్ష్యాలను అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీవో వెంకట్రావు, జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరావు, డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ నాగ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్పీ లోసారి సుధాకర్ బదిలీ

కడప (క్రైం), ఆగస్టు 17: జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా పనిచేస్తున్న లోసారి సుధాకర్‌ను ఏసీబీ అదనపు ఎస్పీగా హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 49 మంది అదనపు ఎస్పీలను బదిలీ చేశారు. ఈ క్రమంలో కడపలో అదనపు ఎస్పీగా పనిచేస్తున్న లోసారి సుధాకర్‌ను బదిలీ చేశారు. ఈయన జిల్లాలో సీఐగా, డీఎస్పీగా పనిచేశారు. ఎన్నికల ముందు జనవరిలో జిల్లా అదనపు ఎస్పీగా నియమితులై సమర్థవంతంగా విధులు నిర్వర్తించారు.

అంజన్న దర్శనం కోసం తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడుతున్న క్యూలు



భక్తులతో కిటకిటలాడిన గండి క్షేత్రం

చక్రాయపేట, ఆస్టు 17: రెండవ శ్రావణ శనివారం గండి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణమాసంలో అంజన్న దర్శనం కోసం భక్తులు తండోపతండాలుగా వస్తుంటారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయాన్నే పాపాఘ్నిలో స్నానాలు చేసి అంజన్న దర్శనం కోసం క్యూలలో నిలబడ్డారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 3.30గంటల వరకు రద్దీ కొనసాగింది. వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా దేవస్థాన సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య అన్ని ఏర్పాట్లు చేశారు. భారీగా భక్తులు రావడంతో స్వామి దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టింది. దేవస్థానం ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులకు అన్నదానం చేశారు. ప్రధాన అర్చకులు కేసరి, ఉప్రపధాన అర్చకులు రాజారమేశ్‌లు అంజన్నను తోమాలలతో అలంకరించారు. టీటీడీ వారు కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన హరికథ కాలక్షేపాలు, భజనలు, కోలాటాలు భక్తులను అలరించాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ రంగనాయకులు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అర్ధరాత్రి విద్యుత్ కార్మికులను చితకబాదిన ఎస్‌ఐ

- వీఆర్‌కు ఎస్‌ఐ అనిల్‌కుమార్

పులివెందుల టౌన్, ఆగస్టు 17: పులివెందులలోని ఓ ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి విద్యుత్ అంతరాయాన్ని పరిష్కరించి తిరిగివస్తున్న విద్యుత్ కార్మికులను ఎస్‌ఐ అనిల్‌కుమార్ చితకబాదారు. బాధితుల కథనం మేరకు.. శుక్రవారం అర్ధరాత్రి వర్షం పడడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడిందని ఫిర్యాదు రావడంతో లైన్‌మేన్ సుధాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు జూనియర్ లైన్‌మెన్ గురురాజు, మహమ్మద్ షఫి వెళ్లి మరమ్మతులు చేసి బైక్‌లో వెనుదిరిగారు. వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద కానిస్టేబుల్ వారి బైక్‌ను ఆపి పూలంగళ్ల సర్కిల్ వద్ద ఎస్‌ఐ ఉన్నారు పదండని పిలుచుకెళ్లారు. విద్యుత్ శాఖలో జూనియర్ లైన్‌మెన్‌గా పనిచేస్తున్నామని, మరమ్మతులు చేసి వస్తున్నామని ఎస్‌ఐ అనిల్‌కు మార్‌కు వీరు సమాధానం ఇచ్చారు. అవి పట్టించుకోకుండా బైక్ బ్యాగ్ చెక్ చేయగా అందులో చేతికి ధరించే ప్లాస్టిక్ గ్లౌజ్, కటింగ్‌ప్లేయర్ కనిపించడంతో దొంగతనం చేయడానికి వచ్చారా అంటూ వారిని చితకబాదారు. వెంటనే ఆ ఉద్యోగులు ఫోన్ ద్వారా లైన్‌మేన్ సుధాకర్‌రెడ్డికి విషయం చెప్పడంతో ఆయన అక్కడకు వచ్చి వివరించారు. అయినా వినకుండా ముగ్గురినీ స్టేషన్‌కు తరలించి అక్కడ మరోసారి చేయి చేసుకున్నారు. ఏఈకి విషయం చెప్పడంతో ఆయన స్టేషన్‌కు వెళ్లగా అందరి దగ్గరా సంతకాలు పెట్టించుకుని వదిలేశారు. దీంతో ఎస్‌ఐ తీరుపై మండిపడ్డ విద్యుత్ సిబ్బంది శనివారం ఉదయం విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. విషయం తెలిసిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు వెంటనే ఎస్‌ఐ అనిల్‌కుమార్‌ను కడప వీఆర్‌కు బదిలీ చేశారు. పూర్తి విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ఎస్‌ఐ చేతిలో దెబ్బలు తిన్న జూనియర్ లైన్‌మేన్‌లు విద్యుత్ శాఖ ఏఈకి అర్జీ రాసి ఇచ్చి ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో ఎవరికి జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా రాత్రి విద్యుత్ కార్మికులను చితకబాదిన సమయంలో ఎస్‌ఐ అనిల్‌కుమార్ మద్యం మత్తులో ఉన్నాడని సమాచారం.


ఎస్‌ఐ కొట్టాడని చెబుతున్న జూనియర్ లైన్‌మెన్లు

ఎంత కష్టమొచ్చిందే.. తల్లీ

- కన్న బిడ్డలతో సహా.. మహిళ ఆత్మహత్య
- గ్యాస్ లీక్ చేసి.. నిప్పంటించుకుని
- మాడి మసైన పసిపిల్లలు
- భర్త వేధింపులు తాళలేక భార్య, పిల్లలు ఆత్మహత్య

(రాయచోటి-ఆంధ్రజ్యోతి) ఈ లోకంలో అమ్మను మించిన త్యాగమూర్తి మరొకరు ఉండరేమో... ఈ సృష్టిలో అమ్మ మాత్రమే భరించలేని నొప్పి.. బాధను ఓర్చుకుని.. తన ప్రాణాలను సైతం ఆ చావుకు ఎదురొడ్డి బిడ్డలకు జన్మనిస్తుంది. అలా రెండు సార్లు ఆ బాధ, నొప్పిని తట్టుకున్న ఈ తల్లికి.. భరించలేనంత.. బ్రతకలేనంత.. కష్టం భర్త రూపంలో ఏమొచ్చిందో.. తన పేగు తెంచుకుని.. తన రక్తాన్ని పంచుకుని.. తన ప్రతిరూపాలై.. కళ్లముందే.. భవిష్యత్తు ఆశాకిరణాలై ఎదుగుతున్న ఆ బిడ్డలను.. తనతో పాటు తిరిగిరాని లోకాలకు తీసుకెళ్లిపోయింది. బిడ్డకు నీళ్లు పోసేటప్పుడు.. ఎక్కడ ఉడుకునీళ్లు పడి ఒళ్లు కాలుతుందో.. అని ఒకటికి పది సార్లు నీళ్లలో చేయి పెట్టి చూసే ఆ తల్లికి.. మొగుడితో.. ఎంత కష్టమొచ్చిందో.. చేతులారా బిడ్డల ప్రాణాలు తీసేంతగా.. తన గుండెను బండ రాయిగా చేసుకుంది.. గాఢ నిద్రలో ఉన్న ఆ పసి మొగ్గలపై నిప్పు పెట్టింది. ఆ మంటల్లోనే.. తాను కాలిపోయింది.. తాను కాలిపోతూ... ఆ మంటల్లోనే.. తన కన్న పేగులను తీసుకెళుతూ.. ఈ కష్టాన్ని.. తన పుట్టినింటికి తెలియజేసింది.. ఏం కష్టమొచ్చిందే.. తల్లీ.. ఎంత ఘోరం చేశావు.. అంటూ అందరూ రోదించిన ఈ దారుణమైన సంఘటన శనివారం ఉదయం 6.30 గంటల సమయంలో రాయచోటి పట్టణంలో జరిగింది. రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్ కథనం మేరకు..

రాయచోటి పట్టణం కొత్తపేట తొగట వీధిలో లక్కిరెడ్డిపల్లె బి.హరిజనవాడకు చెందిన రాజా, గాలివీడు దక్షిణగడ్డ హరిజనవాడకు చెందిన రమాదేవి దంపతులు జీవిస్తున్నారు. పది సంవత్సరాల క్రితం వీళ్లకు పెళ్లి అయింది. వీళ్లకు కొడుకు ప్రభువు మనోహ (8), కూతరు మన్విత (6) ఉన్నారు. . గత ఐదు సంవత్సరాలుగా రాయచోటి పట్టణంలో నివాసం ఉంటున్నారు. బతుకుదెరువు కోసం రాజా రాయచోటి పట్టణంలో టైలర్ షాపు పెట్టుకుని కుటుంబాన్ని పోషించేవాడు. కుటుంబ భారం పెరగడంతో భార్యభర్తలు ఇద్దరూ కువైత్‌కు వెళ్లారు. పిల్లల పోషణ రాజా తల్లి చూసుకునేది. ఆమెకు అనారోగ్య సమస్యలు తలెత్తడంతో పిల్లల ఆలనా పాలన కష్టతరమైంది. దీంతో కువైట్ నుంచి ఇద్దరూ వచ్చారు. పిల్లల దగ్గర భార్యను వదిలి, సంవత్సరం కిందట రాజా తిరిగి కువైత్‌కు వెళ్లాడు. ఇక్కడే రాజా మనసులో అనుమానపు పురుగు తొలిచి.. కుటుంబంలో సమస్యలు మొదలైనట్లు రమాదేవి సోదరుడు నారాయణ తెలిపారు. కువైత్‌కు వెళ్తున్న రాజా ఇంటి చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో గత కొంత కాలంగా రమాదేవికి రాజా వేధింపులు ఎక్కువయ్యాయి. ఈ విషయాన్ని మృతురాలు రమాదేవి తన పుట్టింటి వారికి చెప్పేది. ఈ క్రమంలో ఏమైందో.. ఏమో శనివారం ఉదయం 6గంటల 5 నిమిషాలకు, తాను భర్త వేధింపులు భరించలేకున్నా.. మిమ్మల్ని వదిలి పోతున్నా.. అంటూ రమాదేవి తన అన్న నారాయణకు వాయిస్‌మెసేజ్ పంపింది. ఆయన వెంటనే స్పందించి తెలిసిన వారికి ఫోన్ చేసి మా చెల్లెలు ఇలా మెసేజ్ పెట్టింది.. వెళ్లి చూడమని చెప్పాడు. వాళ్లు వచ్చి చూడగా... రమాదేవి ఇంటిలోని బెడ్‌రూమ్‌లో గ్యాస్ సిలిండర్ లీక్ చేసి బిడ్డలతో సహా ప్రాణాలు తీసుకుంది. ఈ దుర్ఘటనలో తల్లి, బిడ్డలు సజీవ దహనం అయ్యారు. వంట గదిలోని గ్యాస్ సిలిండర్‌ను బెడ్‌రూంలోకి తెచ్చి.. గ్యాస్ లీక్ చేసి మంట పెట్టుకున్నట్లు తెలిసింది. ఆ సమయంలో బెడ్ మీద ఒకరినొకరు అనుకుని ఉన్న అన్నా.. చెల్లెల్లు.. అలాగే మృత్యుఒడికి చేరిపోయారు. చుట్టుపక్కల వారి ద్వారా విషయం తెలుసుకున్న అగ్నిమాపకశాఖ జిల్లా అధికారి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో అగ్నిమాపకశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

ప్రమాద సంఘటన గురించి తెలుసుకున్న రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చేరుకుని సంఘటనపై ఆరాతీశారు. బాధితులకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. రాయచోటి డీఎస్పీ రామచంద్రరావు, అర్బన్ సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ నరసింహారెడ్డి, సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి వచ్చారు. సంఘటనపై చుట్టుపక్కల వారిని విచారించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం కోసం రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలు నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాయచోటి అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జరిగిన సంఘటన అంతా.. ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలో రికార్డు అయినట్లు తెలిసింది. ఈ సీసీ ఫుటేజి ఆధారంగా పోలీసులు విచారణ చేయనున్నట్లు తెలిసింది.


గ్యాస్ ప్రమాదంలో సజీవ రహదనమైన తల్లిబిడ్డలు

బెరైటీస్‌లో అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి

- డీఐజీ ప్రవీణ్‌కు ఎమ్మెల్సీ వినతి



కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 17: ఓబులవారిపల్లె మండలం మంగంపేట బెరైటీస్‌లో జరిగిన అక్రమాలపై గతంలో నమోదు అయిన కేసులో సమగ్ర విచారణ జరపాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్‌ను కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నమయ్యజిల్లా ఓబులవారిపల్లె మండలంలో మంగంపేట వద్ద బెరైటీస్ గనులున్నాయన్నారు. 2019-24 మధ్య కాలంలో కొందరు రాజకీయ బలంతో ముగ్గురాయిని అనధికారికంగా తరలించి వందల కోట్లు ఆర్జించారన్నారు. ప్రధానంగా ఏ గ్రేడ్ ఖనిజాన్ని దొంగతనం చేసి ఎక్స్‌పోర్టు చేశారని, కొందరు ఉద్యోగుల సహకారంతో కొన్ని ఎక్స్‌పోర్టు కంపెనీలు వేల టన్నులను తరలించాయన్నారు. 2023 ఏప్రిల్ 19న ముగ్గురాయి చోరీకి గురయిందని ఈ మేరకు 2023 మే 9న ఏపీ ఎండీసీ అధికారులు ఓబులవారిపల్లె పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారని అన్నారు. ఈ కేసులో దర్యాప్తు సరిగా జరగలేదని అసలు సూత్రధారులను విచారించలేదని తెలిపారు. గనుల నుంచి ఖనిజం బయటకు తెచ్చే ప్రతి వాహనానికి జియోట్యాగ్ ఉంటుందని, లోడ్ ఎత్తుకున్న తర్వాత లారీ ఎక్కడ నుంచి ఎక్కడకి పోయేదన్నది సాంకేతికంగా కనుక్కోవచ్చన్నారు. ఎవరికి ఈ ఖనిజం వెళ్లిందన్నది కూడా స్పష్టంగా తెలుసుకోవచ్చన్నారు. గత ఐదేళ్లలో లక్షల టన్నుల ఖనిజం ఎక్కడ నుంచి ఎక్కడికి పోయిందన్నది దర్యాప్తు చేయలేదని, ఈ కేసులో లారీల విషయం కానీ, ఎవరు కొన్నారనేది తేల్చలేదన్నారు. దర్యాప్తు కంటితుడుపుగా జరిగిందని ఈ వ్యవహారంలో వందల కోట్లు చేతులు మారాయని ఆరోపించారు. ఈకేసుపైన సమగ్ర దర్యాప్తు చేయాలని అసలు సూత్రధారులను గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు.

సీఐని అభినందించిన ఎస్పీ విద్యాసాగర్



సీఐ సాధిక్‌అలీని అభినందిస్తున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటిటౌన్, ఆగస్టు17: పోలీసుశాఖలో విశిష్ట సేవలందించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ద్వారా ప్రతిష్టాత్మక ఇండియన్ పోలీస్ మెడల్ అందుకున్న రెడ్ శాండల్ టాస్క్‌ఫోర్స్ సీఐ సాధిక్ అలీని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో మెడల్ గ్రహీత సాధిక్ అలీ ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు విధులు నిర్వర్తించాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సాధిక్‌అలీ ఎన్నో సంచలనాత్మక కేసులను ఛేదించారన్నారు. చిత్తూరు జిల్లా సత్యవేడు వద్ద సెల్‌ఫోన్ కంటైనర్‌ను అపహరించిన కేసులో దొంగల ముఠాను దేశంలోనే తొలిసారి అరెస్టు చేసి ఘనత సాధించారన్నారు. 2014 నుంచి 2018 మధ్య 500 టన్నుల ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకోవడమే కాక అంతర్జాతీయ, జాతీయ ఎర్రచందనం స్మగ్లర్లను కటకటాల వెనక్కు పంపారన్నారు. 2003లో ఎస్ఐగా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించిన సాధిక్ అలీ ఇప్పటి వరకు 150కిపైగా అవార్డులు, ప్రశంసా పత్రాలు అందుకున్నారన్నారు.

విద్యుత్ విజిలెన్స్ మెరుపుదాడులు

● 18 మందిపై కేసులు నమోదు - రూ.2 లక్షలు జరిమానా



ఇంటి మీటరును తనిఖీ చేస్తున్న విజిలెన్స్

రాయచోటిటౌన్, ఆగస్టు17: విద్యుత్ డీపీఓ ఎస్ఈ శ్రీనివాసబాబు ఆదేశాల మేరకు విజిలెన్స్ డీఈ రమేశ్ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న పలు ఇండ్లల్లో విజిలెన్స్ దాడులు చేపట్టింది. శనివారం నిర్వహించిన దాడుల్లో విద్యుత్ చౌర్యానికి, అక్రమ విద్యుత్ వాడుతున్న 18 మందిని గుర్తించి వారికి రూ.2 లక్షల జరిమానా విధించారు. విజిలెన్స్ అధికారులు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని, విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఏడీఈ మధులత, ప్రవీణ్‌కుమార్, ఏఈలు నాగరాజు, రామాంజనేయులు, రవి, నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పేలిన ఐపీ బాంబు - ఆందోళనలో రైతులు

పెద్దముడియం, ఆగస్టు 17: పెద్దపసుపుల శివార్లలోని శ్రీ గణేశ్ రైతు మిత్ర రూరల్ వేర్‌హౌస్ గోదాముకు నలుగురు యజమానుల్లో ఒకరు ఐపీ దాఖలు చేసినట్లు తెలుస్తోంది. దీంతో ఆ గోడౌన్‌లో సరుకు నిల్వ చేసిన రైతుల్లో ఆందోళన రేకెత్తించింది సమాచారం తెలుసుకున్న రైతులు గోడౌన్‌లో నిల్వ ఉంచిన తమ సరుకు ఉందో లేదోనన్న ఆతృతతో శనివారం పెద్దఎత్తున గోడౌన్‌కు చేరుకున్నారు. ఈ సమాచారం పోలీసులకు తెలియడంతో జమ్మలమడుగు రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి గోడౌన్ వద్దకు చేరుకుని బందోబస్తు నిర్వహించారు. గోడౌన్‌లో సరుకు నిల్వ ఉంచిన రైతులు తమ సరుకులు ఉందో లేదో చూపించాలని పట్టుబట్టడంతో గోడౌన్ తలుపులు తెరిచి శెనగలు, ధనియాలు, జొన్నల బస్తాలను అన్నీ చూపించారు. దీంతో గోడౌన్ వద్దకు వచ్చిన రైతులు వారి సరుకు సురక్షితంగా ఉండడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఐపీ దాఖలు చేసిన వ్యక్తి జమ్మలమడుగు పట్టణం ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తుల వద్ద అప్పు చేసి ఐపీ నోటీసులు ఇచ్చినట్లు సమాచారం.

నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

10 దుంగలు స్వాధీనం



దుంగలు, నిందితులతో అటవీ డివిజనల్ ఫారెస్టు ఆఫీసరు గురు ప్రసాద్

కడప (క్రైం), ఆగస్టు 17: కడప అటవీ డివిజన్ పరిధి లంకమల రిజర్వు అడవి ఖాజీపేట సెక్షన్, బయనపల్లె బీట్, కొండపేట తెలుగుగంగ కెనాల్ వద్ద ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు డివిజనల్ ఫారెస్టు ఆఫీసరు గురు ప్రసాద్ తెలిపారు. ఆయన వివరాలు మేరకు నాగపట్నం వాసి పత్తూరు నాగభూషణం, కె.సుంకేసులపల్లెకు చెందిన గోకన్న శ్రీనివాసులరెడ్డి, వేంపల్లె కాపు వీధికి చెందిన దుంపల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కుప్పాలపల్లెకి చెందిన కుడుమల శ్రీనివాసరెడ్డి స్మగ్లర్లు ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో వారిసపై దాడులు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. 10 ఎర్రచందనం దుంగలను అక్రమరవాణా చేస్తున్న కారు, పైలట్ చేస్తున్న రెండు మోటరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పారిపోయిన అద్దంకి నిఖిల్‌కుమార్ ఆచూకీ కోసం స్క్వాడ్ పార్టీలు గాలిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అటవీ క్షేత్ర అధికారి నయీం అలీ, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లు నాగరాజు, ఖాజారహ్మతుల్లా, రవిచంద్ర, బీట్‌ఆఫీసర్లు శోభారాణి, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతలు అరెస్టు

3 కిలోల గంజాయి, సెల్, రూ.6500 నగదు స్వాధీనం



గంజాయి, వివరాలు వెల్లడిస్తున్న సీఐ సీతారామిరెడ్డి

కడప (క్రైం), ఆగస్టు 17: కడప - తాడిపత్రి బైపాస్ రోడ్డులోని చలమారెడ్డిపల్లె క్రాస్ వద్ద శనివారం గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో ఇన్‌చార్జ్ సీఐ సీతారామిరెడ్డి, ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. కడప భాగ్యనగర్ కాలనీ వాసి మహేశ్, కడప పాత బైపాస్‌లోని వై.జంక్షన్‌కు చెందిన నిమ్మకాయల టైటాన్స్ మనోహర్ చలమారెడ్డిపల్లె క్రాస్ వద్ద గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం. ఎస్పీ ఆదేశాల మేరకు కడప ఇన్‌చార్జ్ డీఎస్పీ సుధాకర్ సూచనల మేరకు డిస్ట్రిక్ట్ నార్కొటిక్స్ కంట్రోల్ సెల్, చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి మూడు కిలోల గంజాయి, సెల్‌ఫోను, రూ.6500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు నిందితులను రిమాండుకు పంపినట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు.

వడదెబ్బతో మహిళ మృతి

నందలూరు, ఆగస్టు 17: వడదెబ్బతో మతిస్థిమితం లేని మహిళ పొన్నాల వెంకటసుబ్బమ్మ(50) మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. రాజంపేట మండలం మన్నూరు వాసి వెంకటసుబ్బమ్మ మతిస్థిమితం లేక ఆలయాల వద్ద భిక్షాటన చేసుకుంటూ జీవించేది. చెన్నై - కడప జాతీయ రహదారి పక్కన నందలూరులో మూసివేసిన ఆల్విన్ కర్మాగార సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణలో వడదెబ్బతో శుక్రవారం రాత్రి మృతి చెందింది. ఎస్ఐ అబ్దుల్‌జహీర్ ఆమెకు ఎవరూలేరని తెలియడంతో మృతదేహానికి పంచాయతీ సిబ్బందితో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

అప్పుల బాధతో రైతు తిరుపాల్‌రెడ్డి ఆత్మహత్య



సింహాద్రిపురం, ఆగస్టు 17: అంకాళమ్మ గూడూరు రైతు కటికిరెడ్డి తిరుపాల్‌రెడ్డి(35) అప్పుల బాధతో తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. సింహాద్రిపురం ఎస్ఐ తులసినాగప్రసాద్ సమాచారం మేరకు తిరుపాల్ రెడ్డి తనకున్న రెండున్నర ఎకరాల చీనీ తోట సాగు చేసుకుని జీవనం సాగించేవాడు. ఇటీవల వ్యవసాయంలో నష్టం రావడంతో అప్పు చేశాడు. దీంతో వడ్డీలు పెరిగి చెల్లించలేక తలకు మించిన భారంగా మారింది. మృతుడు తిరుపాల్‌రెడ్డికి భార్య, కూతురు, కొడుకు ఉన్నారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో కుటుంబీకులు శోక సముద్రంలో మునిగా రు. మృతుని భార్య కటికిరెడ్డి మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తులసినాగప్రసాద్ తెలిపారు.

గ్రామసింహం - భయానకం

వీధుల్లో శునకాల స్వైర విహారం ● కొత్తవారు రావాలన్నా జంకుతున్న వైనం
నియంత్రణలో అధికారులు విఫలం ● ఇదీ జిల్లా కేంద్రం దైన్యం





ఎక్కడ చూసినా కుక్కల బెడద తీవ్రంగా పెరిగిపోతోంది. ఇటీవల కుక్కల దాడులతో అనేక మంది పిల్లలు, పెద్దలు తీవ్రగాయాలపాలైన సందర్భాలూ ఉన్నాయి. వాహనదారులు ప్రమాదాలకు గురైన సమయాలు అనేకం. గతంలో కుక్కల సంతతి ఎక్కువైతే పట్టుకుని చంపేసే వారు. అయితే సమాజంలో ఏ జంతువు, వన్యప్రాణి ప్రాణం తీసే అధికారం ఎవరికీ లేదని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పల్లెలు, పట్టణాలు అనే తేడాలేకుండా కుక్కల సంతతి పెరిగిపోయింది. ఫలితంగా జనాలపై వాటిదాడులు మరీ ఎక్కువయ్యాయి. పలుసందర్భాల్లో పిల్లలు పెద్దల ప్రాణాలకే ప్రమాదం పొంచి వున్న పరిస్థితులు దాపురించాయి. తల్లిదండ్రులు ధైర్యంగా పిల్లలను రోడ్లమీదికి పంపలేని పరిస్థితి నెలకొంది. అయితే కుక్కల సంతతి నియంత్రణ కోసం ప్రభుత్వం శస్త్రచికిత్స చేయడం మొదలు పెట్టింది. ఇందులో భాగంగా జిల్లా కేంద్రం, కడప మున్సిపల్ కార్పొరేషన్ కంటే చిన్న స్థాయి కలిగిన ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో కుక్కల బెడదను అరికట్టేందుకు అధికారులు కుక్కల సంతతిని నియంత్రణ చేపట్టేందుకు శస్త్రచికిత్స చేయడం ప్రారంభించారు. మరి కడపలో ఆదాఖలాలు ఎక్కడా కన్పించలేదనే చెప్పవచ్చు. రాత్రిళ్లు ఎవరైనా కొత్తవారు రావాలన్నా, ఏదైనా పనులకు వెళ్లి ఆలస్యంగా ఇంటికి వచ్చే వారికి కుక్కల ఇబ్బందులు తప్పడంలేదు. అధికారులు ఏవిధంగా స్పందిస్తారో వేచిచూడాలిమరి.

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 17: ఒకటి, రెండు కాదు.. కనీసం పదికి తక్కువ కాకుండా శునకాలు వీధుల్లో స్వైర విహారం చేస్తున్నాయి. వాహన చోదకులపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. చిన్నపిల్లలపై కూడా దాడులు చేస్తున్నాయి. కడప నగరంలో లెక్కకు మించి వీధుల్లో సంచరిస్తూ బాటసారులను భయపెడుతున్నాయి. కుక్కలను చూస్తే తప్పించుకుని తిరగాల్సిన పరిస్థితి నగరవాసులకు ఏర్పడింది. ఇటీవల కడప శివారు ప్రాంతం రామరాజుపల్లెలో ఒక చిన్నారికి కుక్క దాడి చేసి కరవడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దాన్ని నగర ప్రజలు చూసి భయభ్రాంతులకు గురయ్యారు. కుక్కలను పట్టించాలని డిమాండ్ చేస్తున్నారు.

నియంత్రణ లేకపోవడమే అసలు సమస్య



జ్యోతి కెమికల్స్ వద్దగల టిడ్కో ఇళ్లలో...

కడప నగరం కార్పొరేషన్ పరిధిలో కుక్కల నియంత్రణ చర్యలు అటకెక్కడంతో వీటి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. గతంలో కుటుంబ నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులు ప్రయత్నించినా అది కార్యరూపం దాల్చలేదు. సంతానోత్పత్తి తగ్గించే చర్యలు చేపట్టలేదు. నగరంలో



వీధుల్లోనూ కుక్కల స్వైరవిహారం

వేల సంఖ్యలో కుక్కలున్నాయని అధికారుల అంచనా. నిత్యం ఏదోక చోట కుక్కల దాడితో కార్పొరేషన్ ప్రజలు గాయాలపాలవుతున్నారని సమాచారం.

ప్రమాదాలకు కారణం

కడప నగర ప్రాంతం సహా శివారు ప్రాంతాల్లో కూడా కుక్కల బెడద ఎక్కువైంది. రాత్రీపగలు తేడా లేకుండా ద్విచక్ర వాహన చోదకులు, బాటసారులకు ఇవి కనిపించక ప్ర మాదాల బారిన పడుతున్నారు. రాత్రిళ్లు గుంపులు గుంపులుగా కుక్కలు వీధుల్లో తిరుగుతూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. రాత్రివేళ బయట ఉన్న వాహనాల సీట్లు కూడా పాడు చేస్తున్నాయి. వాహన చోదకులపై దాడి చేస్తున్నాయి. కుక్కల అరుపులు, ఏడుపులతో రాత్రుళ్లు నిద్ర లేక నగర ప్రజలు అల్లాడుతున్నారు.

నాలుగువేల కుక్కలకు సర్జరీ చేశాం

కడప కార్పొరేషన్ పరిధిలో నాలుగువేల కుక్కలకు స్టెరిలైజేషన్ చేశాం. రోజూ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ కుక్కలను పునరావాస కేంద్రాలకు చేరుస్తున్నాం. త్వరలో కడప కార్పొరేషన్ పరిధిలో కుక్కలను పూర్తిగా నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- ఎం హెచ్‌ఓ చంద్రశేఖర్, కడప కార్పొరేషన్

ఎస్ఎంసీ ఎన్నికలు వాయిదా

కోరం లేకపోవడమే కారణం ● యథావిధిగా కొనసాగించాలన్న ఎన్నికైన సభ్యులు
టెన్త్‌కు మాత్రమే జరపాలన్న సభ్యులు ● ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతా : హెచ్ఎం



హెచ్ఎంకు ఫిర్యాదు చేస్తున్న కొత్తగా ఎంపికైన సభ్యులు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 17: కడప నగరం మున్సిపల్ హైస్కూలు మెయిన్‌లో పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు వాయిదా పడ్డాయి. శనివారం కడప నగరం మున్సిపల్ హైస్కూలు మెయిన్‌లో ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. కోరం లేని కారణంగా ఎన్నికలను ప్రధానోపాధ్యాయురాలు నాగమణి వాయిదా వేసినట్లు ప్రకటించారు. మున్సిపల్ హైస్కూలు మెయిన్‌లో ఈ నెల 8న ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయి. చైర్మన్, వైస్‌చైర్మన్ సహా సభ్యులను కూడా ఎన్నుకున్నారు. ఎస్ఎంసీ నిబంధనల ప్రకారం లక్షా 44 వేల రూపాయల పైన ఆదాయం ఉన్న వారు సభ్యులుగా ఉండకూడదు. అయితే పదో తరగతిలో ఒక సభ్యుడు నిబంధనలకు విరుద్ధంగా ఎంపికయ్యారు. కడప మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంట్రాక్టు సిబ్బంది రవిని సభ్యుడిగా ఎంపిక చేయడంపై కొందరు కడప ఎమ్మెల్యే మాధవి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆమె ఈ ఎన్నిక చెల్లదని మళ్లీ నిర్వహించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఉన్నతాధికారులు ఎన్నికలను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో శనివారం ఎస్ఎంసీ ఎన్నికలను మున్సిపల్ హైస్కూలులో మెయిన్‌లో నిర్వహించాలి. కాగా 6 నుంచి 10వతరగతి వరకు 1338 మంది ఓటర్లలో 50 శాతం అంటే 669 మంది హాజరైతేనే ఎన్నికలు నిర్వహించాలి. శనివారం కేవలం 301 మంది హాజరయ్యారు. కోరం లేని కారణంగా ఎన్నికలు వాయిదా వేశారు.

తమను యథావిధిగా కొనసాగించాలి : కొత్త సభ్యులు

6వతరగతి నుంచి 9వతరగతి వరకు జరిగిన సభ్యుల ఎంపిక ప్రక్రియ సజావుగా జరిగింది. పదో తరగతి సభ్యుల ఎంపికలో మాత్రమే నిబంధనలకు విరుద్ధంగా జరిగింది. అయితే తమను యదావిధిగా కొనసాగిస్తూ పదోతరగతికి మాత్రమే ఎన్నికలు నిర్వహించాలని కొత్తగా ఎంపికైన సభ్యులు డిమాండ్ చేశారు. హెచ్ఎం నాగమణి దృష్టికి ఈ విషయం తీసుకెళ్లారు. 6 నుంచి 9 తరగతుల్లో ఎటువంటి అవకతవకలు జరగలేదని, తమను కొనసాగించాలని పదోతరగతి మాత్రమే ఎన్నికలు జరపాలని కోరారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతా : హెచ్ఎం

అధికారులు ఇచ్చిన సూచనల మేరకు ఎన్నికలు నిర్వహిస్తామని ప్రధానోపాధ్యాయురాలు నాగమణి స్పష్టం చేశారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ కోరం లేని కారణంగా ఎన్నికలు వాయిదా వేశామని, ఉన్నతాధికారుల ఆదేశాలపై త్వరలో ఎన్నికల తేదీని ప్రకటిస్తామని స్పష్టం చేశారు.

నిందితులకు శిక్ష పడేలా కృషిచేయాలి

కోర్టు మానిటరింగ్ సిబ్బందికి దిశానిర్దేశం చేసిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



కోర్టు మానిటరింగ్ సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప (క్రైం), ఆగస్టు 17: సకాలంలో సాక్షులను కోర్టులో హాజరు పరిచి బాధితులకు న్యాయం జరిగేలా నేర నిరూపణ చేసి నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు కోర్టు మానిటరింగ్ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. శనివారం పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని కోర్టు మానిటరింగ్ సిబ్బంది, పోలీసు స్టేషన్లకు చెందిన కోర్టు కానిస్టేబుళ్లతో సమీక్షించిన ఎస్పీ మాట్లాడుతూ కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉన్నతాధికారులకు నివేదించాలని ఆదేశించారు. అన్ని ట్రయల్ కేసుల్లో సత్వర, సక్రమ విచారణ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కోర్టు ద్వారా సంబంధిత కేసుల్లో సీసీ నెంబర్లను తీసుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త చట్టం మేరకు కోర్టు ప్రొసీడింగ్స్ జరిగేలా చూడాలని ఎస్పీ ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్, కోర్టుమానిటరింగ్ సెల్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ వినయకుమార్‌రెడ్డి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్లు డి.భాస్కర్‌రెడ్డి, సయ్యద్ హసం పాల్గొన్నారు.

బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

ఉత్తర్వు నెంబర్ 75 జారీ ● ఆగస్టు 19 నుండి 31 వరకు అనుమతి
ఐదేళ్లు పూర్తి అయిన వారు తప్పనిసరి బదిలీ ● ఆగస్టు 25 లోపు దరఖాస్తు దాఖలు

కడప(రూరల్) ఆగస్టు 17: 2024 జూన్ 6న వెలువడిన సార్వత్రిక ఫలితాల్లో టీడీపీ కూటమి ఘనవిజయం సాధించి అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలలకు ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. శనివారం ఉత్తర్వు నెంబర్ 75 ఫైనాన్స్ అండ్ ప్లానింగ్‌ను ప్రభుత్వం జారీచేసి ఆగస్టు 19 నుంచి 31 లోపు సాధారణ బదిలీలకు అనుమతించింది. ప్రస్తుతం పనిచేస్తున్న కార్యాలయంలో ఐదేళ్ల సర్వీసు పూర్తి అయిన వారిని తప్పనిసరిగా బదిలీ చేయాలని పేర్కొంది. ఏవేని రిక్వెస్టు, అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ కింద బదిలీ కోరేవారు కూడా బదిలీకి ధరఖాస్తు చేసుకోవచ్చుని పేర్కొంది. క్రమశిక్షణా చర్యలు కానీ, శాఖాపరచర్యలు కానీ ఉన్నట్లైతే బదిలీకి అనర్హులుగా పేర్కొంది. సాధారణ బదిలీలపై నిషేధం సెప్టెంబర్ 1 నుంచి అమలులోకి వస్తుందని తెలిపింది. ప్రభుత్వ తాజా ఉత్తర్వుల మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ పరిధిలోని జడ్పీ, డీపీఓ, పీఆర్, డ్వామా, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖలో బదిలీల ప్రక్రియను ఆయా జిల్లా అధికారులు చేపట్టనున్నారు. జిల్లా ప్రజాపరిషత్‌శాఖ సాధారణ బదిలీకి అర్హులైన ఎంపీడీఓలు, మినిస్టీరియల్, నాల్గవ తరగతి సిబ్బంది ఐదేళ్లు పూర్తి అయిన వారు, రిక్వెస్టు బదిలీకి సంబంధిత అధికారుల అనుమతితో ఆగస్టు 25వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు కడప జడ్పీ కార్యాలయానికి ధరఖాస్తు చేసుకోవచ్చని జడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏవేని రిక్వెస్టు, అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ కింద బదిలీ కోరేవారు కూడా బదిలీకి ధరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్ శ్యామలాదేవి సస్పెన్షన్

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 17: కడప సబ్ రిజిస్ట్రార్ కె.శ్యామలాదేవిని సస్పెండ్ చేస్తూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్ పీజీఎస్ కళ్యాణి శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. కొన్ని ఆరోపణల మేరకు శ్యామలాదేవిని కర్నూలు రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీ చేశారు. అయితే ఆమె ఇంత వరకూ బదిలీ అయిన స్థానంలో విధుల్లో చేరలేదు. విధుల పట్ల నిర్లక్ష్యం కారణంగా ఆమెను సస్పెండ్ చేసినట్లు ఈ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో నాలుగు గేదెలు మృతి



సింహాద్రిపురం, ఆగస్టు 17: దుద్దేకుంట్ల గ్రామంలో విద్యుదాఘాతంతో నాలుగు గేదెలు మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి విద్యుత్ మెయిన్ లైన్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ తీగలు గేదెలకు తగలడంతో అక్కడికక్కడే గేదెలు మృతి చెందాయి. విశ్వనాథ్, గంగనభయుడు, వి. వెంకటరమణ, సంజీవికి చెందిన పశువులుగా గుర్తించారు. వర్షం నీళ్లు నిల్వ వుండడంతో మరమ్మత్తులకు వీలుకాక విద్యుత్ సరఫరా నిపేసినట్లు ఏఈ సుబ్రమణ్యం తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని బాధితులు కోరారు.

అబ్బాయిలకు సత్ప్రవర్తన నేర్పుదాం..

అమ్మాయిలను కాపాడుకుందాం

నేటి సమాజంలో సాంకేతికత ఎంత వృద్ధిచెందిందో... చెడు కూడా అంతే పెరిగిపోతోందని పలువురు పేర్కొంటున్నారు. మానవతా విలువలు నానాటికీ దిగజారితోతూ దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు పెచ్చుమీరుతున్నాయన్నారు. కొందరు యువకులు సెల్‌ఫోన్‌లో చూపించే వికృత చేష్టలకు పాల్పడుతూ బాధితులకు పుట్టెడు దుఖాఃన్ని మిగుల్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని దాష్టీకాలు జరగకముందే చెడు మూలాలను కనుక్కొని సమూలంగా తొలగించాలంటున్నారు. 'అబ్బాయికి సత్ప్రవర్తనను నేర్పిద్దాం.. అమ్మాయిని కాపాడుకుందాం' అంటూ నినదిస్తున్నారు. ఈ నేపథ్యంలో కోల్‌కత్తాలో జరిగిన మెడికో మృతిపై పలు ప్రాంతాల్లో ర్యాలీలు, నిరసనలు, ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి...

మహిళలకు రక్షణ కల్పించాలి: ఎమ్మెల్యే


రిమ్స్‌లో వైద్య విద్యార్థుల నిరసనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 17 : ప్రభుత్వాలు మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తూ నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. శనివారం రిమ్స్‌లో జరుగుతున్న జూనియర్ డాక్టర్ల నిరసనకు ఆమె సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోల్‌కత్తా సంఘటనను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళుతూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారన్నారు. ఏ వృత్తిలో ఉన్నా అందులో విజయం సాధిస్తూ దేశం గర్వించేలా మహిళలు గుర్తింపు తెచ్చు కుంటున్నారన్నారు. నేటి పరిస్థితులకనుగుణంగా చట్టాల్లో మార్పు చేయాల్సిన అవసరాన్ని పాలకులు గుర్తించాలన్నారు. మహిళల రక్షణకు ప్రభుత్వాలు చొరవచూపాలన్నారు. కార్యక్రమంలో వైద్య విద్య విద్యార్థినులు తమ దృష్టికి తెచ్చిన సమస్యలు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జూనియర్ డాక్టర్లు, వైద్య విద్యార్థినులు పాల్గొన్నారు.

రిమ్స్ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ

ప్రభుత్వాసుపత్రిలో ట్రైనీ వైద్యురాలు మౌమితపై పాశవికంగా జరిగిన అత్యాచారం, హత్యను నిరసిస్తూ శనివారం రాత్రి రిమ్స్‌లోని అన్ని విభాగాల వైద్య విద్యార్థినీ, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. రిమ్స్ ఆసుపత్రి నుంచి వందలాదిమంది వైద్యవిభాగానికి చెందిన వారు మౌమితను హత్య చేసిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలంటూ కలెక్టరేట్, మహవీర్ సర్కిల్, ఎర్రముక్కపల్లె సర్కిల్, రాజీవ్ మార్గ్ మీదుగా భారీ ర్యాలీ నిర్వహించి నిరసనను వ్యక్తం చేశారు.

డాక్టర్లపై దాడులు జరగకుండా రక్షణ కల్పించాలి: అమీర్‌బాబు

డాక్టర్లపై దాడులు జరగకుండా రక్షణ కల్పించాలని, కలకత్తా ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళా డాక్టరుపై అత్యాచారం చేసి హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం కడప రిమ్స్‌లో జరుగుతున్న జూనియర్ డాక్టర్ల నిరసనకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్లు దేవుళ్లతో సమానమన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం స్పందించి నిందితుడికి కఠినంగా శిక్షించి ఇకపై ఇలా జరగకుండా చూడాలని కోరారు. టీడీపీ నాయకులు రెహ్మాన్, ఇమ్రాన్, డాక్టర్ వరకుమార్ పాల్గొన్నారు.

అత్యాచార నిందితులను బహిరంగంగా ఉరితీయాలి: ఏఐఎస్‌బీ, పీఎస్‌యూ

జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి అతి క్రూరంగా హత్య చేసిన వారిని బహిరంగంగా ఉరి తీయాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. శనివారం కడప నగరం శంకరాపురం వసతిగృహంలో విద్యార్థినులతో కలిసి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.


కోల్‌కత్తాలో జరిగిన ట్రైనీ డాక్టర్ హత్యపై చేపట్టిన నిరసనలో పాల్గొన్న జూనియర్ డాక్టర్లు, వైద్య విద్యార్థినులు

ఆర్ఎస్‌యూ ఆధ్వర్యంలో...

కడప నగరం ఆర్ఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ బీసీ బాలికల వసతిగృహంలో కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆర్ఎస్‌యూ నాయకులు వసతిగృహ వార్డెన్ ఆరోగ్యమ్మ విద్యార్థినులు హైమావతి, పావని, చైత్ర, లక్ష్మి, కృష్ణ, వనిత వాణి పాల్గొన్నారు.

ప్రాణాలు పోసేవారిని ప్రాణాలు తీస్తారా

చెన్నూరు, ఆగస్టు 17: ప్రాణాలు పోసేవారిని ప్రాణాలు తీస్తారా అంటూ చెన్నూరు సీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్య బృందం పేర్కొంది. ఈ మేరకు శనివారం చెన్నూరులో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చెన్నారెడ్డి మాట్లాడుతూ ఇటీవల వైద్యులపై అత్యాచారాలు పెరుగుతున్నాయని, ఇది సమాజ శ్రేయస్సుకు తీవ్ర ఇబ్బందికరమన్నారు. ఇలాంటి చర్యలను దేశమంతా ఖండించాలన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు మరింత కఠినంగా చర్యలు తీసుకోవడం, న్యాయస్థానాలు కఠిన శిక్షలు అమలు చేయడం అవసరమన్నారు. ఈ సందర్భంగా వైద్యుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. వైద్యులు డాక్టర్ వంశీక్రిష్ణ, సాగర్‌కుమారి, వజీహా, శివశంకర్, శిరీషా, హరీష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల సంఘీభావం

కడప(కలెక్టరేట్), ఆగస్టు17: వైద్యురాలు మౌమితపై పాశవికంగా అత్యాచారం, హత్య చేయడం దుర్మార్గమని, కాంగ్రెస్ నాయకుడు మధురెడ్డి పేర్కొన్నారు. శనివారం రిమ్స్ కళాశాల్లో వైద్య సిబ్బంది, విద్యార్థులు నిర్వహించిన ధర్నాకు సంఘీభావం తెలిపారుఈ సందర్భంగా మాట్లాడుతూ హత్యకు కారకులను కఠినంగా శిక్షించాలన్నారు.

హోమియోకళాశాల విద్యార్థుల ర్యాలీ

ట్రైనీ వైద్యురాలు మౌమిత మృతికి కారకులైన మానవ మృగాలను శిక్షించాలనీ డిమాండ్ చేస్తూ శనివారం పాతరిమ్స్ హోమియోపతి కళాశాల వైద్య విద్యార్థులు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ పాత రిమ్స్ నుంచి ఏడు రోడ్ల కూడలి మీదుగా జరిగింది.



కొవ్వొత్తుల ప్రదర్శనలో ఏఐఎస్‌బీ, పీఎస్‌యూ ప్రతినిధులు



కొవ్వొత్తుల ర్యాలీలో ఆర్ఎస్‌యూ నాయకులు

కేంద్ర భద్రతా చట్టాన్ని వెంటనే అమలుపరచాలి

కమలాపురం రూరల్, ఆగస్టు 17 : కోల్‌కత్తా మెడికో విద్యార్థి హత్యాచార ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, ఇటువంటి ఘోరాలు పునరావృతం కాకుండా మహిళల భద్రత కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ట చర్యలు తీసుకోవాలని కమలాపురం సీహెచ్‌సీ వైద్యసిబ్బంది తెలిపారు. ఈ మేరకు శనివారం వారు నిరసన చేపట్టారు. శనివారం ఉదయం నుంచి ఓపీ సేవలు నిలిచి అత్యవసర సేవలు మాత్రమే వైద్య పరీక్షలు నిర్వహించారు.


డాక్టర్ల నిరసన కార్యక్రమంలో పాల్గొన్న అమీర్‌బాబు... చెన్నూరులో ర్యాలీ నిర్వహిస్తున్న సీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్యులు... కమలాపురంలో నిరసన తెలుపుతున్న వైద్యసిబ్బంది

జర్నలిస్టుల సంక్షేమమే ఏపీయూడబ్ల్యూజే లక్ష్యం

ఘనంగా 68వ వ్యవస్థాపక దినోత్సవం : రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి


పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 17 : జర్నలిస్టుల సంక్షేమమే ఏపీయూడబ్ల్యూజే లక్ష్యమని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి అన్నారు. శనివారం ఏపీయూడబ్ల్యూజే 68వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప నగరం జడ్పీ ఆవరణంలో గల ప్రేమాలయ నిరాశ్రయుల వసతిగృహంలో భోజనం, ఫలహారాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమంతో పాటు సామాజిక సేవల్లో కూడా జర్నలిస్టులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. గత 67 సంవత్సరాలుగా జర్నలిస్టుల సంక్షేమం కోసం అనేక పోరాటాలు చేసిన చరిత్ర ఏపీయూడబ్ల్యూజేకు ఉందన్నారు. పత్రికలు, మీడియా సంస్థలు, ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నపత్రికల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంటు వెంకటరెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, నాయకులు రామాంజనేయరెడ్డి, దేవేంద్రచారి, ఉపాధ్యక్షుడు ఎక్కంటి ఆంజనేయులు, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు శివరాం, బాలక్రిష్ణారెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు, భూమిరెడ్డి శ్రీనాథరెడ్డి, కెమెరామెన్ల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, సబ్ ఎడిటర్స్ రాజు, బాలవెంకటరెడ్డి, దేవనేని రమణ, బాషా, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ సీఐగా వెంకటరమణ బాధ్యతల స్వీకరణ


మాట్లాడుతున్న సీఐ

పులివెందుల టౌన్, ఆగస్టు 17: పులివెందుల రూరల్ సీఐగా శనివారం వెంకటరమణ బాధ్యతలు చేపట్టారు. గతంలో అనంతపురంలో ఇధులు నిర్వహిస్తూ బదిలీలో భాగంగా పులివెందులరూరల్ స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 17 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణం కాపాడాలని కడప ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా శనివారం కడప నగరం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెట్లు మనకు అవసరమైన స్వచ్ఛమైన గాలినివ్వడంతో పాటు భూతాపాన్ని తగ్గిస్తాయని, వర్షాలు పడేలాగు చేస్తాయన్నారు. అంటూ ప్రతిఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి దానిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ నూర్జహాన్, ఎన్ఎస్ఎస్ అధికారి రాజారావు, అధ్యాపకులు హబీబుల్లా, శ్రీరాములరెడ్డి, వెంకటరామిరెడ్డి, చంద్రమౌళి, సుజాత, రోజమ్మ, అమృత తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు డ్రోన్ ద్వారా స్ప్రే : కమిషనర్


స్ప్రే చేసేందుకు డ్రోన్లను పరిశీలిస్తున్న కమిషనరు నందన్

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 17 :కడప నగరంలో దోమల నివారణకు డ్రోన్ ద్వారా స్ప్రే చేయిస్తామని కమిషనర్ వైఓ నందన్ తెలిపారు. శనివారం నాగరాజుపేట నారాయణకాలనీ బ్రిడ్జ్, బుగ్గవంకపై దోమల నివారణకు సంబంధించి డ్రోన్ ద్వారా స్ప్రేయింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ప్రే చేయడం ద్వారా దోమల నివారణ జరుగుతుందని, తద్వారా ప్రజలకు పలు వ్యాధుల నుంచి రక్షణ కలుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ అధికారి చంద్రశేఖర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు నగర పాలక సిబ్బంది పాల్గొన్నారు.

విజయదుర్గాదేవి ఆలయంలో శని త్రయోదశి పూజలు


పూజల్లో పాల్గొన్న ఆలయ వ్యవస్థాపకుడు మల్లిఖార్జునరావు, నిర్వాహకుడు దుర్గాప్రసాద్

కడప (కల్చరల్), ఆగస్టు 17 : శని త్రయోదశి సందర్భంగా స్థానిక విజయదుర్గా దేవి ఆలయంలో శనివారం శనేశ్వరస్వామికి ప్రత్యేక తైలాభిషేకం నిర్వహించారు. గ్రహాలకు అధిదేవత విజయ దుర్గమ్మ ఆధీనంలో ఉంటాయి కావున శనిత్రయోదశి రోజున విజయదుర్గాదేవి సన్నిధిలో ఈ నవగ్రహాల్లోని శనీశ్వరస్వామికి తైలాభిషేకం నిర్వహించడం వల్ల కార్యసిద్ధి కలుగుతుందన్నారు. కావున శనిత్రయోదశి రోజున పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి కి తైలాభిషేకం నిర్వహించారు. మొదట ఆలయ వ్యవస్థాపకుడు మల్లిఖార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్ భక్తులతో కలిసి శనీశ్వరస్వామికి ప్రత్యేక తైలాభిషేకం, అర్చనలు నిర్వహించారు. అలాగే ఈ శ్రావణమాసం 31వ తేదీ కూడా స్వామికి తైలాభిషేకం నిర్వహిస్తామని అర్చక స్వాములు తెలిపారు.

సీఆర్ఐ సుబ్బారెడ్డి సేవలు మరువలేనివి

● వర్ధంతి కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు


సీఆర్ఐ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కడప (మారుతీనగర్), ఆగస్టు 17 : సమాజంలో గల నిరుపేద, దళిత, గిరిజన బడుగు బలహీన వర్గాల ప్రజలకు పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించిన సీఆర్ఐ సుబ్బారెడ్డిని ప్రజలు కలకాలం గుర్తుంచుకుంటారని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తల లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద్‌నాగరాజు పేర్కొన్నారు. సీఆర్ఐ సుబ్బారెడ్డి 9వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం పలువురు బీసీ సంక్షేమ సంఘం నాయకులు సీఆర్ఐ సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు అయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. ఇందులో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సీఆర్ఐ సుబ్బారెడ్డి తనయులు సునీల్, జయంత్ పలుచోట్ల అనాథ శరణాలయల్లో అన్నదానం చేశారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు కళ్యా సుధాకర్, అంజి, బ్లడ్ టు లీవ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పట్టుపోగుల పవన్, సుబ్బారావు, సీఆర్ఐ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

శ్రావణ మాస మహోత్సవాలకు మంత్రికి ఆహ్వానం


మంత్రిని ఆహ్వానిస్తున్న గండి మాజీ చైర్మన్ వెంకటస్వామి

చక్రాయపేట, ఆగస్టు 17: శ్రావణమాసం సందర్భంగా గండి క్షేత్రంలో జరుగుతున్న ఉత్సవాలకు రావాలని మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిని శనివారం గండి మాజీ చైర్మన్ వెంకటస్వామి కోరారు. పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి ఆదేశానుసారం శనివారం రాయచోటి టీడీపీ కార్యాలయంలో మంత్రిని ఆహ్వానించారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి వస్తానని చెప్పినట్లు వెంకటస్వామి తెలిపారు. అనంతరం శాలువ, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరయ్య, బాల అంకిరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ

సింహాద్రిపురం, ఆగస్టు 17: వేణుగోపాల స్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయం పునఃనిర్మాణంలో భాగంగా దేవదాయ శాఖ ద్వారా కోటి రూపాయలు, దాతల ద్వారా వచ్చిన రూ.50 లక్షలతో నూతన ఆలయ నిర్మాణం చేపట్టారు. శనివారం గోపూజ, వాస్తు హోమంతో మొదలైన పూజా కార్యక్రమాలు ఆదివారం ప్రత్యేక పూజలతో పాటు ధ్వజ స్తంభం ఏర్పాటు, గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

'దాడి చేసిన ఎస్ఐను సస్పెండ్ చేయాలి'

కడప (నాగరాజుపేట), ఆగస్టు 17 : పులివెందుల విద్యుత్ ఉద్యోగులపై దాడి చేసిన ఎస్ఐ అనిల్‌కుమార్‌ను సస్పెండ్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్ యూనియన్ జిల్లాగౌరవ అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ఆ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పులివెందుల మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగి జేఎల్ఎం గురు, పోల్ టు పోల్ విధులు నిర్వహిస్తున్న షఫీ వర్షం పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో మరమ్మతులు చేస్తున్నట్లు చెప్పినా రక్తగాయాలయ్యే విధంగా కొట్టారన్నారు.

మోడల్ ప్రాథమిక స్కూళ్లను ఏర్పాటు చేయాలి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 17 :రాష్ట్ర ప్రభుత్వం మోడల్ ఫౌండేషనరు పాఠశాలలతోపాటు మోడల్ ప్రాథమిక పాఠశాలలను తిరిగి అమల్లోకి తీసుకురావాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలు సీవీ ప్రసాద్, చెంగల్‌రెడ్డి కోరారు. గతంలో 80 మంది విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలో ఐదు ఎస్‌జీటీ పోస్టులు ఇచ్చి మోడల్ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేశారని దీంతో ప్రాథమిక విద్య మెరుగుపడిందన్నారు. వీటిని పూర్తిగా నిర్వీర్యం చేస్తూ జీఓ 117 పుట్టుకు వచ్చిందన్నారు. పంచాయతీకి ఒకటి చొప్పున మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేసి డ్రాపవుట్స్ శాతాన్ని తగ్గించాలని కోరారు.

'వైవీయూ ఇన్‌చార్జ్ వీసీని తొలగించాలి'

కడప (మారుతీనగర్), ఆగస్టు 17 : పలు అవినీతి అక్రమాలకు పాల్పడిన వైవీయూ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వీసీ కె.క్రిష్ణారెడ్డిని విధుల నుంచి తొలగించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాసురేశ్ డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రిష్ణారెడ్డి గతంలో మచిలీపట్నంలో గల ఓ విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రారుగా పని చేస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు.

కోర్టు భవనాన్ని పరిశీలించిన న్యాయమూర్తి శ్రీదేవి

కమలాపురం రూరల్, ఆగస్టు 17 : పట్టణంలో తహసీల్దారు కార్యాలయ ఆవరణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాన్ని శనివారం కడప జిల్లా న్యాయమూర్తి శ్రీదేవి పరిశీలించారు. కోర్టు భవనం చాలా ఏళ్ల నాటిది కావడంతో దాన్ని తొలగించి అదే స్థానంలో నూతనంగా భవనాన్ని నిర్మించాలనే ఉద్దేశ్యంతో ఆమె న్యాయవాదులతో కలిసి పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ ఇంజనీరు కళ్యాణి, కమలాపురం బార్ కౌన్సిల్ అధ్యక్షుడు పుష్పరాజు, బార్ కౌన్సిల్ సభ్యులు న్యాయవాదులు పాల్గొన్నారు.

సృజనతోనే ఫోటోగ్రఫీకి ప్రత్యేక గుర్తింపు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 17: సృజనాత్మక శక్తితోనే ఫోటోగ్రఫీ రంగంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనరు లయన్ కె.చిన్నపరెడ్డి తెలిపారు. సోమవారం ప్రపంచ ఫోటోగ్రాఫర్ల దినోత్సవ సందర్భంగా శనివారం కడప నగరం గ్రాండ్ ఇన్ సమావేశ మందిరంలో ఫోటోగ్రాఫర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పూర్వ అధ్యక్షులు రంగనాధరెడ్డితో పాటు పలువురు లయన్స్ క్లబ్, ఇంటాక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు ఏఎఫ్ఏయులో వరల్డ్ ఫోటోగ్రఫీ డే వేడుకలు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 17 : కడపనగరం డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీలో ఈ నెల 19 నుంచి 22 వరకు వరల్డ్ ఫోటోగ్రఫీ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు యూనివర్శిటీ ఫోటోగ్రఫీ కోఆర్డినేటరు డాక్టర్ సంపత్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు విశ్వనాథకుమార్, రిజిస్ట్రార్ రాజేశ్‌కుమార్‌రెడ్డి హాజరవుతారన్నారు. కడప నగరంలో కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు ప్రజలు ఫోటో ఎగ్జిబిషన్ సందర్శించాలని కోరారు.

ఆక్రమణలు తొలగించకపోతే ఎవరినీ వదిలిపెట్టం: సీఐ


చెన్నూరు కొత్తరోడ్డులో ఆక్రమణలను తొలగిస్తున్న సీఐ

చెన్నూరు, ఆగస్టు 17 : ఆక్రమణలు తొలగించకపోతే ఎవరినీ వదిలిపెట్టేది లేదని సీఐ పురుషోత్తంరాజు అన్నారు. శనివారం రాత్రి హైవే రహదారిపై ఆక్రమణలను పరిశీలించారు. శనివారం ఎక్స కవేటర్ సాయంతో ఆక్రమణలను తొలగించారు. రోడ్డుకు తూర్పు, పడమర వైపు బస్సులు వ్యతిరేక దిశల్లో నిలుపుతుండడంతో గతంలో పలు ప్రమాదాలు జరిగాయని, వీటిని ప్రజలకు అనువుగా ఉన్న వైపు నిలపాలని సూచించారు. డ్రైవర్లు మాట వినకపోతే కేసుల తప్పవని హెచ్చరించారు. బాధ్యతలు చేపట్టిన మూడు రోజులకే సీఐ చురుగ్గా వ్యవహరిస్తుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులు లక్ష్యం వైపు అడుగులు వేయాలి

విద్యార్థులు లక్ష్యం వైపు అడుగులు వేయాలని సీఐ పురుషోత్తంరాజు సూచించారు. శనివారం కొండపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు విద్యార్థులకు సమాజం పట్ల విస్తృత అవగాహన కోసం కార్యక్రమాలు నర్వహిస్తున్నామన్నారు. బాగా చదివి సమాజానికి సేవ చేయడంతో పాటు ఉన్నత స్థాయికి ఎదిగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏఎస్ఐ సుధాకర్, సుబ్బయ్య పాల్గొన్నారు.

మహిళల సమస్యల పట్ల నిర్లక్ష్యం వద్దు: ఎస్ఐ


మాట్లాడుతున్న ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి

కడప (క్రైం), ఆగస్టు 17 : ఎక్కడైనా మహిళలకు ఏదైనా సమస్య వస్తే తక్షణమే స్పందించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని చిన్నచౌక్ ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం చిన్నచౌకు పోలీసు స్టేషన్ పరిధిలోని మహిళా పోలీసు కార్యదర్శులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలు స్కూలు, కాలేజీలకు వెళ్లే సమయాల్లో వారిని గమనిస్తుండాలన్నారు. అమ్మాయిల వెంటపడేవారిపై నిఘా ఉంచాలన్నారు.

కమలాపురం సొసైటీ కాలనీలో చోరీ


దుండగులు పగలగొట్టిన బీరువా

కమలాపురం రూరల్, ఆగస్టు 17: స్థానిక సొసైటీ కాలనీ వాసి సాంబశివారెడ్డి ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడినట్లు ఆలస్యంగా వెలుగు చూసింది. కుటుంబీకులు బంధువుల ఊరికి వెళ్లగా దుండగులు శుక్రవారం రాత్రి తలుపు గడియను తొలగించి లోనికి ప్రవేశించి బీరువాను పగలగొట్టారు. అందులో ఉన్న రూ.5వేలు నగదు, రూ.15వేలు విలువైన కమ్మలు, రింగులు లాంటి చిన్న బంగారు వస్తువులు అపహరించుకుని వెళ్లినట్లు కుటుంబసభ్యులు వాపోయారు. విలువైన బంగారు ఆభరణాలు బ్యాంకులో దాచామని లేదంటే అవి కూడా చోరీకి గురయ్యేవన్నారు. చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామని యజమాని సాంబశివారెడ్డి తెలిపారు.

ఖాజీపేట సీఐగా ఆర్ మోహన్



ఖాజీపేట, ఆగస్టు 17: ఖాజీపేట పోలీసు స్టేషన్‌లో శనివారం సీఐ ఆర్ మోహన్ విధులు చేపట్టారు. ఈయన గతంలో అన్నమయ్యజిల్లా కలికిరిలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఖాజీపేటకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అలాగే ప్రజలు కూడా ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా సహకరించాలన్నారు.

పోరుమామిళ్ల సీఐగా శ్రీనివాసులు



పోరుమామిళ్ల, ఆగస్టు 17 : పోరుమామిళ్ల సీఐగా శ్రీనివాసులు శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో సీఐగా పనిచేసిన చిరంజీవి బదిలీ కావడంతో ఆయన స్థానంలో కలకడలో విధులు నిర్వహిస్తున్న ఆయన శనివారం పోరుమామిళ్లలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోరుమామిళ్ల సర్కిల్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూస్తామని శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పుల్లారెడ్డిపల్లె ఎస్ఎంసీ టీడీపీదే

కలసపాడు, ఆగస్టు 17 : మండల పరిధిలోని పుల్లారెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాల, పాఠశాల యాజమాన్య కమిటీ టీడీపీ మద్దతుదారులు గెలుపొందారు. శనివారం జరిగిన ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారు ఎంబడి స్నేహలత చైర్‌పర్సన్‌గా, ఎంబడి జగ్గయ్య వైస్‌చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈ నెల 8న జరిగిన ఎస్ఎంసీ ఎన్నికల్లో వైసీపీ, టీడీపీ ఇరు పక్షాలు ప్రతిష్ఠాత్మకంగా ఎన్నికను తీసుకోవడంతో రసాభాస జరిగి వాయిదా పడ్డాయి. తిరిగి పోలీసు బందోబస్తు మధ్య ఎన్నికలు నిర్వహించగా టీడీపీ మద్దతుదారులు గెలుపొందారు.

మేకవారిపల్లె గురుకుల పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ ఎన్నిక

బి.కోడూరు, ఆగస్టు 17 : మండల పరిధిలోని మేకవారిపల్లె సగిలేరు గురుకుల పాఠశాల విద్యాకమిటీ ఎన్నిక అనివార్యకారణాల వల్ల వాయిదా పడగా తిరిగి శనివారం నిర్వహించారు. మేకవారిపల్లె హైస్కూలు విద్యాకమిటీ చైర్మన్‌గా పెద్దిరెడ్డి వెంకట రమణారెడ్డి, వైస్ చైర్మన్ నిర్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే సగిలేరు గురుకుల పాఠశాల చైర్మన్‌గా అబ్బిగాండ్ల రామయ్యనుఎన్నుకున్నారు. మేకవారిపల్లె ప్రధానోపాధ్యాయుడు రామక్రిష్ణ, సగిలేరు గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిరంజన్ ఎన్నిక నిర్వహించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

రాజుపాలెం, ఆగస్టు 17 : మండల పరిధిలోని అర్కటవేముల గ్రామానికి చెందిన ఓబులపతి నరసింహులు అనే వ్యక్తి వద్ద నుంచి శనివారం 17 మద్యంబాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు రాజుపాలెం ఎస్ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. అక్రమంగా నరసింహులు మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో అతని వద్ద బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆక్రమణలపర్వం... పెన్నాతీరం

● నదీ తీరంలో పంట సాగు.... ఇటుకల బట్టీలు ● ఏళ్ల తరబడి జరుగుతున్న కబ్జాలు ● పట్టించుకోని అధికారులు

ఖాజీపేట, ఆగస్టు 17: కబ్జాకు కానిదేది అనర్హం. నింగిని, నేలను ఏకం చేసే తెలివిని పెంచారనుకున్నారు. ప్రకృతిని నాశనం చేయకూడదన్న ఆలోచన లేకపోవడం ఈ జీవన కోటి దురదృష్టం. తన కంటికి ఏదైనా కనిపిస్తే దోచుకోవాలి, దాచుకోవాలన్నదే ఇప్పటి నైజం. అదే కోవలో పెన్నాతీరం అడుగంటుతూ కుచించుపోతుంటే పాలకులు, అధికారులకు ఎందుకు పట్టదో ఎవరికీ అర్థంకాక పరిష్కారమే లేని ప్రశ్న అయింది. వివరాల్లోకి వెళ్లితే.. మండల పరిధిలోని చెన్నముక్కపల్లె పంచాయతీలో పెన్నాతీరం వెంబడి వైసీపీ ప్రభుత్వంలో ఇష్టానుసారంగా ఆక్రమించుకుని పంటలు సాగు చేస్తున్నారు. నదీ ప్రవాహం ఎక్కువగా వస్తే పంటలు మునిగిపోతాయి. అయితే అధికారులు మాత్రం వేరే సర్వే నంబర్లు వేసి పంట నష్టం కూడా తీసుకున్నట్లు విమర్శలు వస్తున్నాయి. అంతేకాదు ఎక్కడ భూమి ఖాళీగా కనపడితే వైసీపీ నాయకులు అక్కడ ఆక్రమించుకోవడమే. అందుకు అధికారులు వత్తాసు పలకడంతో వారి ఆగడాలు అంతా ఇంతా కాదు. డీకేటీ భూములు, వంక పోరంబోకు ఇలా చెప్పుకుంటూ పోతే మరెన్నో. మండల పరిధిలో పెన్నానది వెంబడి వందల ఎకరాలు ఆక్రమణకు గురైంది. ఆ విషయం అధికారుల దృష్టికి వెళ్లినా వారికి ముడుపులు ముట్టడంతో మాకేమి అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. కొద్దిరోజులు పోతే వంకలు కాలువలు, నదులు వంకలు అవుతాయేమో వేచి చూడాల్సి ఉంది. ఆక్రమణ చేసి ఇటుకలు వేసేవారిపై, భూములు సాగు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే గంగ ఆక్రోశించినప్పుడు ఎందరో బలి కావాల్సి వస్తుంది. ఏది ఏమైనా అధికారులు స్పందించకుంటే ఆక్రమణదారుల ఆగడాలకు అడ్డుకట్ట లేకుండాపోతుంది. వైసీపీ ప్రభుత్వంలో ఆక్రమించుకున్న భూములు, వంకలు, నదులపై ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వమైనా చర్యలు తీసుకుంటుందా అని ప్రజలు వేచి చూస్తున్నారు. కాగా ఈ విషయమై తహసీల్దారు టి. సరస్వతిని వివరణ కోరగా సర్వేయర్‌తో సర్వే చేయించి ఆక్రమణలు జరిగి ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



పెన్నానదిలో సాగు చేసిన భూములు, ఇటుకల బట్టీలు

22 న కొండాపురం మండల సమావేశం

కొండాపురం, ఆగస్టు 17 : మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 22న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నాగప్రసాద్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. మండలంలోని అన్ని ప్రధాన సమస్యలపై ఈ సమావేశంలో చర్చిస్తామన్నారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ఎంపీడీవో ఒక ప్రకటనలో తెలిపారు.

ఇసుక లారీలు, ఎక్స్‌కవేటర్ సీజ్



ఇసుక లారీ, ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్న దృశ్యం

ఎర్రగుంట్ల, ఆగస్టు 17: మండలంలోని రామాంజనేయపురం సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఎక్స్‌కవేటరు, లారీని సీజ్ చేసినట్లు ఎర్రగుంట్ల అర్బన్ సీఐ నరేష్‌బాబు తెలిపారు. గిద్దలూరు, ప్రొద్దుటూరుకు చెందిన 5గురు వ్యక్తులు ఈ దందాకు పాల్పడుతున్నట్లు ఆయన తెలిపారు. వారిపై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జాతీయ చలనచిత్ర అవార్డులలో తెలుగుసినిమాకు అన్యాయం

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 17: జాతీయ చలనచిత్ర అవార్డుల ఎంపికలో తెలుగు సినిమా రంగానికి అన్యాయం జరిగిందని నందమూరి యువ సేవా సమితి అధ్యక్షుడు గోమేదికం సుదర్శన్ పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ చలనచిత్ర అవార్డులకోసం తెలుగుసినిమాలు పోటీపడ్డాయన్నారు. ఆ సినిమాలలో సృజనాత్మకత, ప్రజాదరణ పొందిన సినిమాలు ఉన్నా కూడా కేంద్ర ప్రభుత్వం తెలుగు సినిమా రంగం పట్ల వివక్ష చూపిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి టప్పా మహబూబ్‌బాష, బానూనాయుడు, సుబ్బరాజు, సమర, మచ్చా నాగభూషణం, షేక్షావలి పాల్గొన్నారు.

సులభమైన బోధనను అలవర్చుకోవాలి: ఎంఈవో

కాశినాయన ఆగస్టు17: ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు కొత్తవిషయాలను తెలుసుకుంటూ బోధనలో సులభతరమైన విధానాలను అలవర్చుకోవాలని ఎంఈవో ఓ.నిర్మల పేర్కొన్నారు. శనివారం నర్సాపురం జడ్పీ హైస్కూల్లో పాఠశాల సముదాయ సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె ఉపాధ్యాయులకు పలుసూచనలు, సలహాలు తెలిపారు. అనంతరం రీసోర్స్‌పర్సన్‌లు ప్రసాద్,వెంకటేష్,బాలరాజులు ఉపాధ్యాయులకు తెలుగు,సైన్సు,గణితం సబ్జెక్టులపై సులభతరమైన బోధనా విధానాలపై అవగాహనపరిచారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 17 : రోడ్డు ప్రమాదాలపై డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని శనివారం మండల కేంద్రంలోని ఐదు రోడ్ల కూడలిలో డ్రైవర్లకు సలహాలు, సూచనలు ఎస్ఐ చంద్రశేఖర్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని, అలాగే ఎక్కువ లోడ్‌తో వెళ్లకూడదని, మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. ప్రతి డ్రైవరు లైసెన్సు కలిగి ఉండాలని, ప్రతి వాహనాన్ని పోలీసుస్టేషన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ సుబ్బయ్య, కానిస్టేబుళ్లు ఉన్నారు.

మరోసారి వాయిదా పడ్డ కొత్తూరు ఎస్ఎంసీ ఎన్నిక



పాఠశాల బయట వాదోపవాదాలు జరుపుకుంటున్న దృశ్యం

పోరుమామిళ్ల, ఆగస్టు 17 : విద్యాకమిటీ చైర్మన్ ఎన్నిక మరోసారి వాయిదా పడింది. శనివారం పోరుమామిళ్ల మండలంలోని కొత్తూరు గ్రామంలో విద్యాకమిటీ ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు.ఆ పాఠశాలలో 18 మంది విద్యార్థులుండగా 13 మంది మెంబర్లు ఉన్నారు.

దీంతో టీడీపీకి ఆరు గురు మెంబర్లు ఉండగా వైసీపీకి 7 గురు మెంబర్లు ఉండడంతో చైర్మన్ ఎన్నికపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. నాయకుల మధ్య వాదోపవాదాలు కూడా జరిగాయి. దీంతో అధికారులు ఇరుపార్టీల నాయకులను సమావేశపరిచి శాంతియుతంగా ఎన్నికలు జరిపేందుకు ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. దీంతో గుడి అబివృద్ధికి కానీ బడి అభివృద్ధికి కానీ ఎవరు ఎక్కువ డబ్బులు ఇచ్చేందుకు ముందుకు వస్తారో వారికే కమిటీ చైర్మన్ కట్టబెట్టేందుకు సుముఖంగా ఉన్నామని పరస్పరం చర్చలు జరిగాయి. కానీ అవి కూడా బెడిసికొట్టడంతో కొద్దిసేపు ఇరుపార్టీల నాయకుల మధ్య వాదోపవాదాలు జరిగాయ. చివరికి పోలీసులు రంగప్రవేశం చేయడంతో విద్యాకమిటీ ఎన్నికలు వాయిదా పడ్డాయి.

24న జంబులింగేశ్వరస్వామివారి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

జమ్మలమడుగు, ఆగస్టు 17: జమ్మలమడుగు పట్టణంలో పెన్నానది తీరాన ఉన్న జంబులింగేశ్వరస్వామి దేవాలయం పునఃనిర్మాణం ప్రథమ వార్షిక వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు ధనిరెడ్డి ఓబుళరెడ్డి, తెలిపారు. అదేరోజు ఉదయం గణపతిపూజ తదితర పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సాయంత్రం మూడు గంటల నుంచి శివపార్వతుల గ్రామోత్సవం ఉంటుందన్నారు. అదే రోజు మధ్యాహ్నం అన్నదానం ఉంటుందన్నారు. భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

'ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే ఏపీజీబీ లక్ష్యం'



మాట్లాడుతున్న జనరల్ మేనేజరు గిరి

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 17 :ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు లక్ష్యమని ఆ బ్యాంకు జనరల్ మేనేజరు గిరి పేర్కొన్నారు. గతంలో ఉన్న బ్రాంచ్‌ను శనివారం నూతన భవనంలోకి మార్చిన సందర్భంగా రిబ్బన్ కట్ చేసి బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఆయనతో పాటు రాజంపేట డివిజన్ ఆర్ఎం సుశాంత్‌కుమార్, ఎస్ఎం భాస్కర్‌రెడ్డి ఉన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజరు బాలాదిత్య, అసిస్టెంటు మేనేజరు రాము, వెలుగు డిపార్ట్‌మెంటు అసిస్టెంటు మేనేజరు ప్రకాశ్‌రావు, కమ్యూనిటీ కోఆర్డినేటరు బాలయ్య, నారాయణ, భాస్కర్, గ్రామ సంఘం అసిస్టెంట్లు అనూషా, శాంతమ్మ, లక్ష్మీదేవి, బిజినెస్ కరస్పాండెంట్లు, ఖాతాదారులు పాల్గొన్నారు.

ప్రజలు శాంతియుతంగా జీవించాలి

చాపాడు, ఆగస్టు 17: మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రజలు శాంతియుతంగా జీవించాలని మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్ అన్నారు. శనివారం రాత్రి సీఐ, ఎస్ఐ చిన్నపెద్దయ్య, స్పెషల్ పార్టీ పోలీసులు ఖాదర్‌పల్లె, నక్కలదిన్నె, చిన్నగురవలూరు సమస్యాత్మక గ్రామాల్లో వారు పర్యటించారు. ఈ సందర్భంగా వారు గ్రామస్థులతో మాట్లాడారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

● కోల్‌కత్తా వైద్యురాలిపై హత్యాచార ఘటన నేపథ్యంలో వైద్యులు, సిబ్బంది నిరసన ర్యాలీ

జమ్మలమడుగు, ఆగస్టు 17: జమ్మలమడుగు పట్టణంలో ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట శనివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపుమేరకు జమ్మలమడుగు బ్రాంచ్‌లో డాక్టర్లు, సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఆస్పత్రి ఎదుట పట్టణంలోని సీఎస్ఐ క్యాంబెల్ నర్సింగ్ కళాశాల విద్యార్థులు తాతిరెడ్డి రామలింగారెడ్డి ఆస్పత్రి, డాక్టర్ రామేశ్వరుడు ఆస్పత్రి తదితర ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యులు నిరసన తెలిపి అక్కడి నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. గాంధీ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడి ప్రాణం పోసే వైద్యులనే హత్యాచారానికి పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అందుకు నిరసనగా పట్టణంలోని అన్ని ప్రైవేటు, ప్రభుత్వ వైద్యసేవలు నిలిపివేసినట్లు వారు తెలిపారు. కోల్‌కత్తాలో విధుల్లో ఉన్న వైద్యురాలిపై ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం దారుణమన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందించి చర్యలు తీసుకోవాలని కోరారు. డాక్టర్లు చంద్రకళ, శిల్ప, విజయలక్ష్మి, స్వప్న, ఆశ, కిరణ్, సుచరిత, వసంత, అమృత, హరికృష్ణ, రంగస్వామి, నర్సింగ్ విద్యార్థులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: కోల్‌కత్తాలో ఇటీవల జూనియర్ వైద్యురాలిని హత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మీనాక్షిరెడ్డి, ఉపాధ్య క్షుడు డాక్టర్ గోపాలక్రిష్ణయ్య, సెక్రటరీ డాక్టర్ వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్లు, వైద్యసిబ్బందితో కలిసి స్థానిక పెన్షనర్స్ కార్యాలయం నుంచి నెల్లూరు రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం అనంతరం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. ఈ ఘటనపై సీబీఐతో విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ వెంకట దినేష్, డాక్టర్లు వినయ్‌కుమార్, క్రాంతికుమార్,పద్మావతి, రామ్‌ప్రతాప్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, దివ్య తేజ, హరికిరణ్, క్రిష్ణ, హరిక్రిష్ణ, ఎన్జీవో సెక్రటరీ నరసింహారెడ్డి, శివరామిరెడ్డి,గురుమూర్తి, ఎస్ఏ సత్తార్ పాల్గొన్నారు.





జమ్మలమడుగు, బద్వేలులో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు, సిబ్బంది

పోరుమామిళ్ల..: కోల్‌కత్తాలో పీజీ వైద్య విద్యార్థినిపై అఘాయిత్యానికి పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలని డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కళ్యాణచక్రవర్తి అన్నారు. శనివారం పోరుమామిళ్లలో వైద్యులు మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు అఖిల, లక్ష్మి, మృదుల, సృజన, జయరాములు, నాగేంద్ర, రమణారెడ్డి, బాలక్రిష్ణారెడ్డి, శివక్రిష్ణ, కార్తీక్, హెల్త్‌ఎడ్యుకేటరు సాదు వెంకటేశ్వర్లు, ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం..: కోల్‌కత్తాలోని మహిళా జూనియర్ డాక్టరుపై అత్యాచార ఘటనపై మండలంలోని ప్రభుత్వ హాస్పిటల్‌లో ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు కలివెల్ల రాజశేఖర్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సంపత్‌కుమార్, అరవింద్, భాస్కర్, జ్యోత్స్న, సుశీలమ్మ, ప్రేమ, విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు టౌన్..: కోల్‌కత్తాలో డాక్టర్‌పై హత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను నడిరోడ్డులో ఉరి తీయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయ్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల..: వైద్యులపై దాడులు హేయమైన చర్యఅని ఎర్రగుంట్ల అర్బన్, పీహెచ్‌సీ వైద్యులు శ్రీనాథ్‌రెడ్డి, ప్రయాంక, జ్యోత్స్న పేర్కొన్నారు. కోల్‌కత్తాలో జరిగిన ఘటనను వారు తీవ్రంగా ఖండించారు. ఎర్రగుంట్లలో అర్బన్ హెల్త్ సెంటర్‌నుంచి నాలుగురోడ్ల కూడలి వరకు ఆరోగ్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు.

ప్రజా ధనమంటే ఇంత నిర్లక్ష్యమా..!

మైదుకూరు రూరల్, ఆగస్టు 17 : మున్సిపాలిటీలోని ప్రజలు ఇంటి పన్నునీటి పన్ను ఇలా పలురకాల పన్నుల రూపంలో చెల్లించే డబ్బులే మున్సిపాలిటీ అభివృద్ధికి అధికారులు వినియోగిస్తుంటారు.వచ్చిన డబ్బులను ప్రజల సౌకర్యార్థం మౌలికవసతుల కల్పనకే ఆడబ్బులను ఖర్చు చేస్తుంటారు. కానీ అధికారుల నిర్లక్ష్యం వలన ప్రజాధనం దొడ్డి దారిన దొంగలపాలౌతోంది. మైదుకూరు పట్టణంలోని పాత మున్సిపల్ ఆఫీసు ప్రక్కనే ఉన్న పంచాయతీ ఆఫీసులో రిపేరు చేసిన బోరు పంపులు,బోరు మోటారులు,పైపులు భద్రపరుస్తుంటారు. గతంలో మున్సిపల్ ఆఫీసు ఇక్కడే ఉండటంతో ఎప్పుడు రద్దీగా ఉండేది.కానీ ఇప్పుడు మున్సిపల్ ఆఫీసు ఊరి బయటకు వెళ్లింది,కానీ పాత మోటార్లు మాత్రం ఇక్కడే ఉన్నాయి.వాటిని పట్టించుకొనే నాథుడే కరువయ్యారు. దీంతో మోటార్లు దొంగలపాలౌతున్నాయని ప్రజలు వాపోతున్నారు.ఇప్పటికైనా అధికారుల స్పందించి మోటార్లు,పైపులు వేరే చోట భద్రపరచాలని,లేదా అక్కడే కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



గదిలో ఉంచిన తాగునీటి బోర్లు,పైపులు



అధ్వానంగా ఉన్న బోర్లు, పైపులు భద్రపరచిన గది

బోడిశెట్టిపల్లెలో సీతారాముల కల్యాణం

అట్లూరు, ఆగస్టు 17 : మండలంలోని బోడిశెట్టిపల్లె గ్రామంలో నూతన ఆలయం నిర్మించి సీతారాముల లక్ష్మణ ఆంజనేయ సమేత విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం సీతారాములకళ్యాణం వైభవంగా జరిగింది. గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు దున్నుతల సుబ్బారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, సురవీరారెడ్డి కళ్యాణంలో పాల్గొన్న భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

చెన్నకేశవస్వామి గ్రామోత్సవం

రాజుపాలెం, ఆగస్టు 17 : శ్రావణ మాసం రెండో శనివారం సందర్భంగా వెల్లాల పుణ్యక్షేత్రంలో సతీ సమేతంగా చెన్నకేశవ, శ్రీదేవి భూదేవి గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచే స్వామివారి పూజలలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. అనంతరం పల్లకీ సేవ, గ్రామోత్సవం నిర్వహించారు. మేళతాళాల మధ్య స్వామివారి గ్రామోత్సవం ఆలయ పుర వీధుల్లో తిప్పారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోండి

పోరుమామిళ్ల, ఆగస్టు 17 : గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు వీరపోగు రవి డిమాండ్ చేశారు. శనివారం వారు ఓ ప్రైవేటు పాఠశాల ఎదుట ధర్నా చేశారు. కార్యక్రమంలో నాయకులు చారీ, మధు, సంజయ్, నరసింహ పాల్గొన్నారు.